
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,51,567లు, బంగారం 4 గ్రాము 580 మిల్లీగ్రాములు వెండి 65 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రహదారి సౌకర్యం కల్పిస్తాం

రాయగడలో చైతీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 10లో



విద్యార్థుల పాత్ర కీలకం

ఏబీవీపీ సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి మాట్లాడారు.

- 10లో

న్యూస్‌రీల్

ప్రీతి స్మిత భోయ్‌కి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బల్ పురస్కారం



రాష్ట్రపతి చేతుల మీదుగా రాష్ట్రీయ బల్ పురస్కారం అందుకుంటున్న క్రీడాకారిణి ప్రీతి స్మిత భోయ్

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన ప్రీతి స్మిత భోయ్‌కు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బల్ పురస్కార్-2024 లభించింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం న్యూ ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పతకం, ధృవపత్రం, సైటేషన్ బుక్‌లెట్‌ను అందజేశారు. భారతదేశం వీర్ బల్ దివస్ పురస్కరించుకుని జాతీయ స్థాయిలో 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 17 మంది చిన్నారులకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. వీరిలో 7 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారు. కళలు-సంస్కృతి, సాహసం, సృజనాత్మకత, విజ్ఞానం-సాంకేతికత, సంఘ సేవ, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ 7 రంగాల్లో ప్రత్యేకత ప్రదర్శించిన బాలలకు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఢెంకనాల్‌కు చెందిన 15 ఏళ్ల ప్రీతి స్మిత భోయ్ వెయిట్‌లిఫ్టింగు క్రీడా రంగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి భారతీయ క్రీడాకారిణిగా సరికొత్త చరిత్ర ఆవిష్కరించడం విశేషం. ఆమె 2024లో ఐడబ్ల్యూఎఫ్ ప్రపంచ యువజన వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఈ బాలిక 76 కిలోల లిఫ్ట్‌తో ప్రపంచ స్థాయిలో కొత్త రికార్డును నెలకొల్పింది.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో మరణించిన గౌతమ మఝి

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమీప డాల్‌ఖాయి మందిర ప్రాంతంలో బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తి బంధువులు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ముందు రాస్తారోకో చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో నవరంగపూర్ జిల్లా రాయిఘర్ ప్రాంతం ఒక కుటుంబం ఒక కారులో మల్కన్‌గిరి వెళ్తోంది. విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారి బొయిపరిగుడ పోలీసు స్టేషన్ సమీప డాల్‌ఖాయి మందిర ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ఆ కారు ఢీకొనగా అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి గౌతమ మఝి (22)ను స్థానికులు బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గౌతమ్ మఝి పనిపై టంగిణిగుడ గ్రామం వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన దొంగలు, స్వాధీనం చేసుకున్న సొత్తు

జయపురం: ఒక ఇంట్లో చోరీ కేసులో ఇద్దరు నిందితులను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి రమణీరంజన్ దొళాయ్ గురువారం తెలియజేశారు. అరెస్టైనవారిలో స్థానిక ఒడియా మేదరి వీధికి చెందిన బిశాల నాగ్, అశోక్ హియాల్‌లు ఉన్నట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోపబంధునగర్‌లోని నిత్యానంద దాస్ ఇంట్లో ఈనెల 10వ తేదీన చోరీ జరిగింది. ఇంట్లోని నగదు, రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురవ్వడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4 వేలు, బంగారు ఉంగరం, వెండి వస్తువులు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

కొనసాగుతున్న .. రైతుల కష్టాలు



● పుట్టి ముంచిన అకాల వర్షాలు ● కౌలు రైతు ఆత్మహత్య ● బెంబేలెత్తిన ప్రభుత్వం



కిడిగాంలో ఎమ్మెల్యేకు అకాల వర్షాలకు కుళ్లిన ధాన్యం చూపిస్తున్న రైతులు

భువనేశ్వర్: అకాల వర్షాలతో రాష్ట్ర రైతులు అవస్థలు పడుతున్నారు. సాగు పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గంజాం జిల్లా బారంగ్ మండలం బొడొమాధాపూర్ గ్రామంలో కౌలు రైతు బొనొమాలి పెంతెయ్ పంట నష్టంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కుటుంబంలో నలుగురు కుమార్తెలు, ఒక కొడుకు పెద్ద దిక్కుని కోల్పోయారని వాపోతున్నారు. పంట నష్టం తన తండ్రిని పొట్టన బెట్టుకుందని విచారం వ్యక్తం చేశారు. బొనొమాలి పెంతెయ్ గ్రామంలోని 5 ఎకరాల పొలంలో సాగు చేశాడు. దీని కోసం రూ. 2 లక్షలు అప్పు చేసి రాత్రింబవళ్లు శ్రమించాడు. అకాల వర్షాలు పంటను నీట ముంచాయి. ఆశలు నీరు గారడంతో అప్పులు తీర్చలేని ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీసు బృందం ఘటనా స్థలం సందర్శించి విచారణ చేపట్టారు.

బీమా కంపెనీలపై మంత్రి ఆగ్రహం

అకాల వర్షంతో పంట నీట మునిగిన పరిస్థితుల్లో కౌలు రైతు ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటనతో ప్రభుత్వం ఉలికిపాటుకు గురైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి పంట బీమా కంపెనీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీమా కంపెనీలు లాభార్జనకు పరిమితం కాకుండా రైతాంగం సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించాలని మంత్రి తెలిపారు. ఆపదలో ఉన్న రైతులకు తక్షణమే పరిహారం చెల్లించకుంటే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పరిహారం చెల్లించే క్రమంలో రైతులను వేధించడం, పరిహారం చెల్లింపు ప్రక్రియలో అవాంఛనీయ జాప్యం పట్ల ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తుందని హెచ్చరించారు. పంటల బీమా సంక్షోభ సమయంలో రైతులను ఆదుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా కంపెనీలు రైతుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు. ఈ ఏడాది డిసెంబర్ 24 నాటికి 20 వేల మంది రైతులు పంటల బీమా కోసం దరఖాస్తు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అకాల వర్షాల ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఊహాతీతంగా పంట నష్టం చోటు చేసుకుంది. పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసి పరిహారం చెల్లిస్తుందని మంత్రి పీడిత రైతులకు హామీ ఇచ్చారు. మూడు, నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు చురుకుగా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లను ఆదేశాలు జారీ అయినట్లు పేర్కొన్నారు. పంట నష్టం విశ్లేషణ పూర్తి కావడంతో వరి కొనుగోలు కోసం మండీలు తెరుస్తారు. ఈ మేరకు త్వరలో పూర్తి సమాచారం జారీ అవుతుందని మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పంట నష్టంపై అంచనా ప్రక్రియ మందకొడిగా సాగడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్ని ఈ నెల 28న వ్యవసాయ, సహకార, ఇతర శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనంతరం సమగ్ర పంట నష్టం నివేదికని ముఖ్యమంత్రికి సమర్పించడం జరుగుతుందన్నారు.

రైతులకు ఎమ్మెల్యే పరామర్శ



పొలంగట్టుపై నడుస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: కాశీనగర్ సమితిలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పరామర్శించారు. గజపతి జిల్లాలో కాశీనగర్, బూదర, కిడిగాం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే రూపేష్‌తో పాటు జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, ఎస్‌ఏసీ మాజీ చైర్మన్ చంద్రరావు తదితరులు ఉన్నారు. అకాల వర్షాలకు రంగుమారిన ధాన్యం, తడిసిపోయిన వరి కుప్పలను ఎమ్మెల్యే రూపేష్ సందర్శించి నష్టపరిహారం కోసం అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



పూరీ దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయ పాలకవర్గం ప్రచురించిన ఆంగ్ల సంవత్సరపు నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి గురువారం ఆవిష్కరించారు. తొలి క్యాలెండర్‌ని స్వామివారికి సమర్పించారు. డెస్క్, వాల్ క్యాలెండర్ రెండు రకాలుగా దీనిని ముద్రించినట్లు ప్రకటించారు. డెస్క్ క్యాలెండర్‌ను రాష్ట్ర కళాకారులు, సైకత శిల్పులు ఆవిష్కరించిన కళాత్మక చిత్రాలతో రూపొందించగా, రథంపై మూల విరాటుల అపురూప శోభతో ఆకట్టుకునే చిత్రాలతో వాల్ క్యాలెండర్ విడుదల చేసినట్లు తెలిపారు. పూరీ మరియు భువనేశ్వర్ ప్రాంతాల్లో శ్రీమందిరం సమాచార కేంద్రంలో ఈ క్యాలెండర్లు అమ్మకానికి ఏర్పాటు చేశారు. కొత్త క్యాలెండర్ ఆవిష్కరణోత్సవానికి రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి డాక్టర్ అరవింద కుమార్ పాఢి, పూరీ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ హాజరయ్యారు.

గవర్నర్ రఘుబర దాస్‌కు ఆత్మీయ వీడ్కోలు



విమానాశ్రయంలో గవర్నర్, ముఖ్యమంత్రి వీడ్కోలు కరచాలనం

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన రఘుబర దాస్‌కు సాదరంగా వీడ్కోలు పలికారు. గురువారం ఆయన సొంత రాష్ట్రానికి తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన సభ స్పీకరు సురమా పాఢి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇతర మంత్రి మండలి సభ్యులు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రఘుబర దాస్‌కు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆదరణ, ఆత్మీయత మరువ లేనిదిగా పేర్కొన్నారు. స్వల్పంగా 14 నెలల కాలం పాటు రాష్ట్ర గవర్నరుగా బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించడంపై ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల స్నేహం, ప్రేమాభిమానాలు చిరస్మరణీయమని అన్నారు.

తన రాజీనామాపై చెలరేగిన వ్యాఖ్యలు, ఊహాగానాలు రాజకీయాల్లో సహజమేనని దాట వేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. స్థానిక రాజ్ భవన్‌లో ప్రత్యేకంగా వీడ్కోలు విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘుబర దాస్‌కు ముఖ్యమంత్రి, స్పీకరు సాదరంగా దుశ్శాలువా కప్పి సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ ఆవరణలో గౌరవ కవాతు అందుకుని తిరుగు ప్రయాణానికి విమానాశ్రయానికి బయల్దేరారు.



రాజ్ భవన్‌లో రఘుబర దాస్‌కు సత్కరించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



రాజ్ భవన్‌లో గౌరవ కవాతుతో గవర్నర్‌కు వీడ్కోలు

ఘనంగా కమ్యూనిస్టు పార్టీ శత వార్షిక వేడుకలు



పార్టీ శతజయంతి ఉత్సవంలో ప్రసంగిస్తున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: కమ్యూనిస్టు పార్టీ సమసమాజ నిర్మాణం కోసం పోరాడుతోందని రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి అన్నారు. కమ్యూనిస్టు పార్టీ శతజయంతి వేడుకల సందర్భంగా గురువారం జయపురంలోని జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఘనంగా వేడుకలు జరుపుకుంది. ఈ సందర్భంగా స్థానిక బాబాసాహెబ్ కల్యాణ మండపంలో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ కమ్యూనిస్టు పార్టీ లాగానే ఆర్‌ఎస్‌ఎస్ కూడా వందేళ్లు పూర్తి చేసుకుందని, కానీ మత విభేదాలకే పరిమితమైందని విమర్శించారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీ, వామపక్షాలు పోరాటం సాగిస్తున్నాయని అన్నారు. జిల్లా సమస్యలపైన, ప్రజల హక్కులపైన, ఆదివాసీ ప్రజల భూహక్కులపైన పోరాటం సాగించేందుకు పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఉత్సవంలో జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, సహాయ కార్యదర్శులు రామకృష్ణ దాస్, కుమార జాని, ఉత్తమ మల్లిక్, డొమయి మఝి, దయామణి సమరతి, జాదూనాథ్ గౌఢ తదితరుల ప్రసంగించారు.



కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మహిళలు



ర్యాలీలో ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు చేస్తున్న మహిళలు


రైతు సమస్యను అర్థం చేసుకోండి




ధాన్యం మండీ వద్ద రైతులతో మాట్లాడుతున్న ప్రదీప్ మాఝి

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లాలోని మండీలో రైతులకు న్యాయం జరగడం లేదని బీజేడీ నాయకుడు ప్రదీప్ మాఝి అన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన ఐదు రోజుల తర్వాత కూడా డబ్బులు జమ కావడం లేదని, అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోతోందని, ఈ నష్టం ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మలకన్‌గిరి బీజేడీ కార్యకర్తలు మనాస్ మడ్కమి, గోపాలపండా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సమారి టాంగులు, లక్ష్మీప్రియ నాయిక్, మల్కన్‌గిరి వైస్ చైర్‌పర్సన్ కవితా మోహంతో పాల్గొన్నారు.

ఘనంగా బీజేడీ వ్యవస్థాపక దినోత్సవం



పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తదితరులు



రాయగడ: బిజూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నెక్కంటి తదితరులు

రాష్ట్రవ్యాప్తంగా బీజేడీ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మాజీ సీఎం బిజూ పట్నాయక్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించిన పార్టీ బీజేడీ అని ఆ పార్టీ నాయకులు అన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అనునిత్యం ప్రజల కోసమే సమయాన్ని కేటాయిస్తోందన్నారు. రాష్ట్రంలో ఇటీవల అధికారం చేపట్టిన బీజేపీ ప్రజలను మభ్యపెడుతోందని దుయ్యబట్టారు. ప్రజలు ఇప్పుడిప్పుడే వాస్తవాలు తెలుసుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో మరలా విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్

ఆదుకోవాలని రైతుల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న గుసాని సమితి రైతులు



రంగుమారిన ధాన్యంతో నిరసన తెలుపుతున్న ఉప్పలాడ రైతులు

పర్లాకిమిడి: అకాల వర్షాలతో నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు మొలకెత్తిన వరికంకులు, రంగుమారిన ధాన్యంతో కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ముఖ్యంగా గుసాని సమితిలో బుసుకిడి, అంకుడు, ఉప్పలాడ, బాగుసల ప్రాంతాల్లో వర్షాలకు పంటలు నాశనమయ్యాయని వాపోయారు. వర్షాలు వస్తాయని కనీసం అధికారులు హెచ్చరికలు కూడా చేయకపోవడంతో కోతలు కోసిన ఖరీఫ్ పంట పొలాల్లోనే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఖరీఫ్ పంట అంతా నాశనమైందని తెలిపారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని విలపించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ పట్నాయిక్, అంకుడు గ్రామ రైతులు బూర్లె బాలరాజు, బుసుకిడి సమితి సభ్యుడు శైలాడ నారాయణ రావు, సర్పంచ్ తెంబూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదుపు తప్పిన ట్రక్కు.. డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన ట్రక్కు

భువనేశ్వర్: సిమెంటుతో నిండిన ట్రక్కు అదుపు తప్పి కల్వర్టు నుంచి 30 అడుగుల లోతుకు జారింది. ఈ ప్రమాదంలో ట్రక్కు నుజ్జునుజ్జయ్యింది. ట్రక్కులో చిక్కుకున్న డ్రైవరు దుర్మరణం పాలయ్యాడు. విశాఖపట్నం నుంచి సుందరగడ్‌కు సిమెంటు రవాణా చేస్తుండగా నయాగడ్ జిల్లా దసపల్లా పోలీసు ఠాణా సమీపం బొరీహ పేట గ్రామం కల్వర్టు దాటుతుండగా ప్రమాదానికి గురైనట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. సహాయక బృందం ఘటనా స్థలానికి చేరి నుజ్జు అయిన ట్రక్కులో చిక్కుకున్న డ్రైవరు మృత దేహన్ని బయటకు తీశారు. మృతుడిని ఝూర్ఖండ్ కొడెర్మా జిల్లా జిలోడి గ్రామస్తుడు బొనేష్‌గా గుర్తించారు. దసపల్లా ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: మండలంలోని కొత్త రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కూన భరత్‌కుమార్ (38) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. ఎచ్చెర్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన భరత్‌కుమార్ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన ఆయన గార మండలం ఆడవరం గ్రామంలో ఉన్న అత్తవారింటికి బైక్‌పై వెళ్లాడు. బుధవారం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కొత్త రోడ్డు జంక్షన్ వద్ద ఒడిశాకు చెందిన కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో భరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. భరత్‌కుమార్‌కు భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- 12 మంది నిందితుల అరెస్టు
- 3.5 కేజీల గంజాయి, 11 మొబైల్ ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం, ఎస్సై చిరంజీవి, సిబ్బంది

రణస్థలం: గంజాయి క్రయవిక్రయాలు సాగిస్తున్న 12 మందిని గురువారం అరెస్టు చేసినట్లు రణస్థలం మండలం జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. రణస్థలం మండల కేంద్రం సమీపంలోని దన్నానపేట పెట్రోల్ బంకు వద్దకు రెండున్నర కేజీల గంజాయితో ఆరుగురు వ్యక్తులు వస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టారు. వారు రాగానే ఎస్ఐ.చిరంజీవి, సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. గంజాయితో పాటు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నాం. పట్టుబడిన ఆరుగురిలో ఒకరు మైనర్. ఈ గంజాయి రవాణాలో జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలసకు చెందిన నంబూరి సాయి అనే ట్రాక్టర్ మెకానిక్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన రబింద్రో ప్రధాన్ ద్వారా గంజాయి కొనుగోలు చేసి రణస్థలంలో పొట్లాల రూపంలో అమ్ముతున్నాడు. ఇతనితో పాటు సీతంవలసకే చెందిన పల్లంటి సత్యనారాయణ, లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన కోల హర్షవర్ధన్, రణస్థలం మండలం రావాడకు చెందిన తీటి దుర్గాప్రసాద్, మైనర్ కలిసి గంజాయి అమ్ముతున్నారు. వీరి వద్దకు స్థానికులతో పాటు ఇతర జిల్లాలు, మండలాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుండటం గమనార్హం. ప్రధాన నిందితుడు నంబూరి సాయి ఇచ్చిన సమాచారం మేరకు నిఘా వేయగా యూబీ పరిశ్రమ ఎదుట ఉన్న కాలువ వద్దకు గంజాయి కొనేందుకు వచ్చిన మరో ఐదుగురిని కూడా పోలీసులు పట్టుకున్నారు. వీరిలో జె.ఆర్.పురం పంచాయతీ గరికిపాలెం గ్రామానికి చెందిన కొలుచూరు సంతోష్‌కుమార్, పైడిభీమవరం గ్రామానికి చెందిన బుసర పైడిరాజు, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం పేరాపురం గ్రామానికి చెందిన ఉప్పాడ విజయ్‌కుమార్, రెల్లివలసకు చెందిన చందక వెంకటేష్, భోగాపురం మండలం సుందరపేటకు చెందిన బంగారు పవన్‌కుమార్ ఉన్నారు. రెల్లివలసకు మహంతి దిలీప్ పరారీలో ఉన్నాడు. మొత్తం 12 మందిని తహసీల్దార్ (మేజిస్ట్రేట్) ఎన్.ప్రసాద్ సమక్షంలో అరెస్టు చూపించామని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 11 ఫోన్లు, నాలుగు బైకులు, 3.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి ముఠాను ఛేదించిన ఎస్సై చిరంజీవిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



చైతీ కలశంతో మంత్రి నాయక్, కలెక్టర్ పట్వారి



కలశ యాత్రలో పాల్గొన్న జనం



మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్



చైతీ ప్రారంభోత్సవాల వద్ద జనం

అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పిస్తాం



మంత్రి కత్తిసాము

- రాష్ట్ర గ్రామీణ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రవినారాయణ నాయక్
- రాయగడలో ప్రారంభమైన చైతీ ఉత్సవాలు

రాయగడ: అన్ని గ్రామాలకు రహదారి సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర గ్రామీణ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రవినారాయణ నాయక్ అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో చైతీ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. రహదారులు మెరుగుపడితే ప్రజల దీనావస్థలు, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని అన్నారు. గత ప్రభుత్వం రెండు దశాబ్దాలకు పైబడి అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలోని బిసంకటక్ సమితి పురణాపాణి ప్రాంతంలో పర్యటించానని, అక్కడ నిర్మితమవుతున్న మెగా తాగు నీటి ప్రాజెక్టు పనులు తీవ్ర అసంతృప్తినిచ్చాయని అన్నారు.

సంస్కృతిని పరిరక్షించడమే మనందరి బాధ్యత

ఆదివాసీ భాష సంస్కృతి, వారి కళలను పరిరక్షించడం మనందరి బాధ్యత అని కలెక్టర్ ఫరూల్ పటాన్వరి అన్నారు. చైతీ పేరిట నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు వారి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని వివరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మైదానంలో సుమారు 350 స్టాళ్లను ఏర్పాటు చేశామని వివరించారు. ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న పనులకు అద్దం పట్టేవిధంగా ఈ స్టాల్‌లలో ప్రదర్శన రూపంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ తదితరులు ప్రసంగించారు. ఆదివాసీ ప్రాంతమైన ఈ జిల్లాను మరింత అభివృద్ధి చేయాల్సిన అవశ్యకతపై వక్తలు ప్రసంగించారు.

కలశ యాత్రలో మంత్రి

చైతీ ఉత్సవాల్లో భాగంగా స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి ప్రారంభమైన చైతీ కలశ యాత్రలో మంత్రి నాయక్ పాల్గొన్నారు. మజ్జిగౌరి మందిరం నుంచి చైతీ వేదిక వరకు కాలినడకన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కత్తిసాము చేసి అందరినీ అబ్బుర పరిచారు. అదేవిధంగా ర్యాలీలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. లంజియా, డొంగిరియా సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే నృత్యాలను యువతీ, యువకులు చేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్స్ నృత్యాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.



చైతీ ప్రవేశ ద్వారం



సెల్ఫీ జోన్ వద్ద సందడి



చైతీ ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి నాయక్, పక్కనే కలెక్టర్ పట్వారి



చైతీ సమావేశ వేదికపై మంత్రి నాయక్‌తో పాటు కలెక్టర్, ఎమ్మెల్యేలు



ఎన్‌సీసీ క్యాడెట్లు



ట్రాన్స్‌జెండర్స్ నృత్యాలు



ఆదివాసీ నృత్యాల్లో యువతీ, యువకులు



లంజియా సవర నృత్య ప్రదర్శన

ఒడిశా వికాసంలో విద్యార్థుల పాత్ర కీలకం: సీఎం



ఏబీవీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం

భువనేశ్వర్: వికసిత ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర అవతణ శతాబ్ది పురస్కరించుకుని 2036 నాటికి ఈ ధ్యేయం సాధించాలనే దృఢ సంకల్పంతో తొలి రోజు నుంచి ప్రభుత్వ కార్యాచరణ ఆరంభమైందని, ఈ కార్యాచరణలో విద్యార్థులు ముందంజ సేనగా నిలవాలని సీఎం మోహన్ చరణ్ పిలుపునిచ్చారు. కటక్ ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 49వ రాష్ట్ర స్థాయి సమావేశాల ప్రారంభోత్సవం పురస్కరించుకుని ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో యువ నాయకత్వం జాతీయ ప్రయోజనాలకు ప్రాముఖ్యత ఇస్తుందని తెలిపారు. మన వారసత్వాన్ని, సనాతన సంప్రదాయాన్ని పతాక స్థాయిలో రెపరెపలాడించడంలో సహాయపడుతుందని ప్రోత్సహించారు.

విద్యార్థి లోకం వర్ధిల్లుతుంది

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వికసిత ఒడిశాలో విద్యార్థి లోకం అగ్ర స్థానంలో ప్రాధాన్యత సంతరించుకోవడం తథ్యమని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల పరీక్షలు, ఉపాధ్యాయ, అధ్యాపక నియామక ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపీ) రాష్ట్రంలో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

త్వరలో ఎన్నికలు

గత కొన్ని సంవత్సరాలుగా నిలిచి పోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు కొత్త విద్యా సంవత్సరం నుంచి పునరుద్ధరిస్తుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విద్యార్థులకు వాగ్దానం చేశారు. సుసంపన్న ఒడిశా ఆవిష్కరణకు విద్యార్థి వర్గం సహకారం, ప్రమేయం అవసరమని, ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘం ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకుంటాయని తెలిపారు. 2018 సంవత్సరం నుంచి పలు కారణాలు, పరిస్థితుల మధ్య రాష్ట్రంలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిలిచి పోయాయి. తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు, కోవిడ్ - 19 తాండవం, విద్యా సంస్థల్లో అశాంతి వాతావరణం వంటి పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి తాజా హామీ ప్రకారం కొత్త విద్యా సంవత్సరం నుంచి ఈ ఎన్నికల పునరుద్ధరణ జరుగుతుందనే నమ్మకం విద్యార్థి వర్గాన్ని ఉత్సాహపరిచింది.



సమావేశానికి హాజరైన ప్రముఖులు

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మురగన్ టీమ్



విజేతగా నిలిచిన మురగన్ టీమ్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 గ్రామంలో పుష్ప సినిమాలోని పాత్రధారుల పేర్లతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మురగన్ టీమ్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో మురగన్ టీమ్ 16 ఓవర్లలో 130 పరుగులు చేయగా, పుష్ప టీమ్ 14 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఈ టోర్నీలో పాల్గొన్న 11 టీములకు పుష్ప సినిమాలోని క్యారెక్టర్ల పేర్లను పెట్టడం విశేషం.

సర్జిఫుల్‌లో గోవిందపల్లికి ఉత్తమ స్థానం

మల్కన్‌గిరి: జిల్లా ఖోయిర్‌పూట్ సమితి గోవిందపల్లి ఎస్ఎస్‌డీ హయ్యర్ సెకండరీ పాఠశాలకు రాష్ట్రంలో అత్యుత్తమ స్థానం దక్కింది. భువనేశ్వర్‌లో జరిగిన సర్జిఫుల్ ప్రోగ్రాం 2024లో ఈ పాఠశాలకు ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని దక్కించుకుంది. విద్యార్థులు సైన్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతోనే ఈ పురస్కారాన్ని అందించారు. ఈ స్థానం రావడానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితోనే సాధ్యమైందని పాఠశాల హెచ్ఎం అశోక్ కుమార్ తెలిపారు. ఈ అవార్డును స్వయంగా భువనేశ్వర్ వెళ్లి హెచ్ఎం అందుకున్నారు.

ఉత్తమ జ్యోతిష్య శాస్త్రవేత్తకు ఘన సన్మానం



ప్రసిద్ధ వాస్తు, జ్యోతిష్యుడు ఆచార్య భగీరథ బిందానిని సన్మానిస్తున్న అతిథులు

జయపురం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గజియబాద్ శివశంకర జ్యోతిష్ శాస్త్ర, వాస్తు అనుసంధాన కేంద్రం వారు గత రెండు రోజులలో జాతీయ జ్యోతిష్య శాస్త్రం, వాస్తు సెమినార్ నిర్వహించారు. ప్రసిద్ధ జ్యోతిష్య శాస్త్ర విశారద, పండితులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. సెమినార్‌లో ఒడిశా తరపున పాల్గొన్నవారిని ఉత్తమ జ్యోతిష్య శాస్త్రవేత్తగా సన్మానించారు. సెమినార్‌లో నాడి, పంచతంత్ర, వాస్తు, జ్యోతిష్ శాస్త్రంపై పరిశోధనార్థకంగా ఆధారాలతో ప్రసంగించిన ఆచార్య భగీరథ బిందానిని ప్రసంశిస్తూ ఆచార్య పదవితో సన్మానించారు. సెమినార్‌లో దేశంలోని అనేక ప్రాంతాల నుంచి 550 మంది వాస్తు, జ్యోతిష్కులు పాల్గొన్నారు. బ్రజ మండల్ జీవణ దర్శన్ అనే పుస్తకం ఆవిష్కరింపజేశారు. సమగ్ర భారత దేశంలో జ్యోతిష్ శాస్త్ర విశాదలు, పండితులు పాల్గొన్న సెమినార్‌లో జ్యోతిష్ శాస్త్రం, వాస్తు, మొదలగు విషయాలపై చర్చించారు. ప్రముఖ సమాజ సేవి రాజేష్ బనసాలి అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ప్రత్యేక అతిథిగా రామ్‌అవతార్ జిందాల్, అనిల్ గర్గ్, పండిత బి.కె. హనుమాన్, రాష్ట్రీయ లోక్‌దల్ రాష్ట్ర సాధారణ కార్యదర్శి రవీంద్ర చౌహాన్, జాతీయ ముఖపత్ర ఇందిరజిత్ సింగ్, టిటు సందీప్ భండారి, రాకేష్ గర్గ్, పలుగురు ప్రముఖులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న వాస్తు, జ్యోతిష్కులు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రక్తనిధి



జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో రక్తనిధి



రక్తదానం చేస్తున్న దాత

జయపురం: జయపురం ఫూల్‌బెడలో గల కొరాపుట్ జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో ఎట్టకేలకు రక్తనిధి కేంద్రం గురువారం నెలకొల్పారు. ఇప్పటివరకు జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు వచ్చే రోగులు రక్త పరీక్షలకు తమకు అవసరమైన గ్రూప్ రక్తం కోసం హాస్పిటల్ నుంచి 4 కిలో మీటర్ల దూరంలో గల పాత సబ్‌డివిజన్ హాస్పిటల్ కు పరుగులు తీయాల్సి వచ్చింది. రోగుల బంధువులు రక్తం కోసం పలు ఇక్కట్లు పడ్డారు. గురువారం నుంచి జిల్లా కేంద్రం హాస్పిటల్‌లోనే అవసరమైన రక్తం లభించగలదని రోగులు, వారి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి రూ.142 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా కేంద్ర హాస్పిటల్ భవనాలను ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం చేసిన విషయం విధితమే ఆ భవనాలలో మొదటి అంతస్తులో రక్త నిధిని ప్రారంభించారు. 12 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో 15 గదులు రక్త నిధిని కేటాయించారు. వాటిలో రక్త సంగ్రహ కేంద్రం, రక్త సంరక్షణ, రక్త దాతల విశ్రాంతి గృహం, వైటింగ్ హాల్, అధికారుల కోసం ఒక ప్రత్యేక గది, ఏర్పాటు చేయబడింది. ఒక అధికారితోపాటు నలుగురు లేబ్ టెక్నీషియన్లు, నలుగురు అటెండర్లు, ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లను నియమించారని అధికార వర్గాలు వెల్లడించాయి.

వ్యక్తి అరెస్ట్



గంజాయి నిందితుడు అశీమ్ మాల్లిక్

మల్కన్‌గిరి: గంజాయి కేసులో నిందితుడు అశీమ్ మాల్లిక్‌ను జిల్లా బలిమెల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. అశీమ్ మాల్లిక్ 999 కేజీల గంజాయిను అక్రమాంగా తరలిస్తుండగా చిత్రకొండ సమిపంలో 2021లో అరెస్టు చేశారు. ఏడాది తరువాత బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టుకు హాజార్ కవడం లేదు. ఎన్ని సార్లు నోటీసులు పంపినా కోర్టుకు రావడం లేదు. ఎక్కడైనా కానిపిస్తే అరెస్టు చేయాలని దీంతో కోర్టు ఆదేశాలు జారీ చేశారు. బలిమెల డైలీ మార్కెట్‌లో అశీమ్‌ను చూసిన కోందరు బలిమెల ఐఐసికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఐఐసి దీరాజ్ పట్నాయక్ అక్కడకు చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి మల్కన్‌గిరి కోర్టులో హాజరుపరిచారు

క్లుప్తంగా

మద్దువలసలో షూటింగ్ సందడి



మద్దువలస ప్రాజెక్టు వద్ద సినిమా షూటింగ్

వంగర: మద్దువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు పరిసరాల్లో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. ప్రసాద్ డైరక్షన్‌లో శ్రీపద్మిని సినిమాస్ బ్యానర్‌పై తెలుగు, మరాఠి భాషల్లో తెరకెక్కనున్న సినిమాకు సంబంధించి వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. శ్రీహర్ష ఆదిభట్ల మ్యూజిక్ డైరక్షన్‌లో హీరోలు మాదవ్‌చెక్క, ప్రదిమేష్ పరబ్, హీరోయిన్స్ మోనిక, రూపాలిభీంషన్‌లు నటించనున్నారు. ముంబయి, హైదరాబాద్‌కు చెందిన చిత్ర యూనిట్ సభ్యులు ప్రాజెక్టు ప్రాంగణంలో పలు సన్నివేశాలు షూటింగ్ చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో కెమెరామెన్ ఎస్.కె.వల్లి, చిత్ర యూనిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సర్వే నివేదిక సచివాలయాల్లో ప్రదర్శన

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల సర్వే నివేదికను జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల నోటీస్ బోర్డుల్లో గురువారం ప్రదర్శనకు ఉంచామని నివేదికపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోపు తెలిపేందుకు అవకాశం కల్పింస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. వచ్చే నెల 6వ తేదీలోగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. షెడ్యూల్డ్ కులాల సర్వే తుది నివేదికను ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 10వ తేదీన ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన సర్వే నివేదికలను పరిశీలించి తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో బహుళ ప్రయోజనాల భవన నిర్మాణాలు

- ట్రైబుల్ వెల్ఫేర్ ఈఎన్‌సీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో బహుళ ప్రయోజనాల భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్టు ట్రైబుల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫేజ్ వన్‌లో 72 భవనాలకు రూ.43 కోట్లు మంజూరు కాగా రెండు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఒక్కో భవనానికి రూ.60లక్షలు మంజూరు చేశామన్నారు. రెండో దశలో 53 భవనాల నిర్మాణాలకు రూ.31 కోట్లు మంజూరయ్యాయన్నారు. గోకులాలకు 92కుగాను రూ.20 కోట్లు మంజూరు కాగా 28 పూర్తయ్యాయన్నారు. మిగతావి వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నామన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో 146 పనులకు రూ.109 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్టికల్ 275 పథకంలో బాగంగా 26 పనులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. రూ.16 కోట్లతో స్కూల్స్ అదనపు భవనాలు నిర్మించనున్నామన్నారు. 14 ఏకలవ్య పాఠశాలల భవనాల నిర్మాణాలకుగాను 7 పూర్తి చేశామన్నారు. మిగతావి వచ్చే జూన్ నాటికి పూర్తి చేయనున్నామన్నారు. ఈఈ రమాదేవి, డీఈ సింహాచలం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన మంజులవాణి

గుర్ల: కట్టుకున్న భర్తను మద్యం మానేయాలని పలుమార్లు హెచ్చరించినా తన విధానాన్ని మార్చుకోకపోవడంతో భార్య మనోవేదనకు గురై పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన గుర్ల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుజ్జింగివలసకు చెందిన ఉక్కుడు శంకరరావు మద్యానికి బానిస కావడంతో భార్య ఉక్కుడు మంజులవాణి (30) మద్యం మానేయాలని పలుమార్లు సూచించింది. ఈ నెల 24న కుమార్తె పుట్టిన రోజు వేడుకలకు కూడా మద్యం సేవించి రావడంతో మంజులవాణి మనోవేదనకు గురైంది. అదే రోజు ఇంట్లో ఉన్న గడ్డి మందును సేవించింది. అపస్మారక స్థితిలో వున్న ఆమెను పక్కింటి వారు గమనించి ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేసారు. వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం జిల్లాలోని క్విన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

సంప్రదాయ విజ్ఞానం గొప్పది

- ఐజీఎన్సీఏ కార్యదర్శి సచ్చిదానంద జోషి
- వేడుకగా గిరిజన యూనివర్సిటీ, సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్త సాంస్కృతిక సమ్మేళనం



సాంప్రదాయ గిరిజన నృత్య ప్రదర్శన



సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాలను ప్రారంభించిన ఐజీఎన్సీఏ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ సచ్చిదానంద జోషి, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

విజయనగరం అర్బన్/నెల్లిమర్ల రూరల్: ప్రాచీన భారతీయ సంప్రదాయ విజ్ఞానం ఆధునిక విజ్ఞానం కంటే చాలా గొప్పదని అది నేటి మేధస్సుకు కూడా అంతుచిక్కడం లేదని న్యూఢిల్లీకి చెందిన ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్సీఏ) మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ సచ్చిదానంద జోషి అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో స్థానిక గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో సాంస్కృతిక సమ్మేళనం గురువారం ప్రారంభమైంది. తొలిత నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చికిత్సకు అందని నేటి వైద్యాన్ని వేల సంవత్సరాల క్రితమే ప్రాచీన గిరిజనులు కనుగొన్నారని వివరించారు. అది ప్రాచీన భారతీయ విజ్ఞానం యొక్క గొప్పతనమని గుర్తు చేసారు. అక్షరజ్ఞానం లేకుండానే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కనుగొన్నారని కొనియాడారు. నేడు విద్యావంతులు ప్రతి పనికి డిజిటల్ టెక్నాలజీపై ఆధారపడుతున్నారని, క్రియేటివిటీ కంప్యూటర్ మీద ఆధారపడుతున్నారని విమర్శించారు. సృజనాత్మకత పెరగాలంటే జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండాలన్నారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి మాట్లాడుతూ గిరిజనులు పండించే చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఉందన్నారు. ప్రపంచంలో భారత్‌ను విశ్వ గురువుగా చూపించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. మాలవికా జోషి మాట్లాడుతూ భారతీయులు మెరుగైన జీవనం తమ ఆశయమన్నారు. సదస్సులో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, ప్రత్యేక అతిథి విశ్వదీప్ శుక్ల, సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, ఐకేఎస్ కన్వీనర్ డాక్టర్ దేవికారాణి, గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, సమన్వయకర్త డాక్టర్ ఎన్‌వి.సూర్యనారాయణ, డీన్ శరత్ చంద్రబాబు, డీన్ జితేంద్ర మోహన్ మిశ్రా, డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ కె.సురేష్ బాబు, డాక్టర్ నాగేష్, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రేమ, డాక్టర దేబాంజన్ నాగ్, సెంచూరియన్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక సెంచూరియన్ యూనివర్సిటీలో నిర్వహించిన గిరిజనుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నృత్యాలు, శ్రీమోదుకొండమ్మ నాటిక ఆహుతులను అలరించాయి.

మాడిపోయిన తెల్ల బంగారం



అంతకాపల్లి సమీపంలో వర్షాలకు పూత మాడిపోయిన పత్తి పంట

- తుఫాన్ వర్షాలతో పాడైన పత్తి పువ్వు, పిందె
- ఈ ఏడాది జిల్లాలో 1777 హెక్టార్లలో సాగు

రాజాం : తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంటను తుఫాన్ కోలుకోలేని దెబ్బతీసింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంచి పూత దశలో ఉన్న పత్తి పంట పూర్తిగా నష్టాల బారిన పడింది. నవంబర్ నెలలో పూతకు వచ్చిన పంట ఆరు దఫాలుగా పూతకు వచ్చే అవకాశం ఉంటుంది. తొలి దశ కంటే రెండు, మూడు దశల్లో వచ్చే పూత మంచి నాణ్యత ఉండడంతో పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఇదే సమయంలో వరుసుగా వర్షాలు కురవడంతో పిందె పూర్తిగా పాడవ్వడం, పూత దశలో ఉన్న పత్తి నల్లగా మారిపోవడం, పత్తి పువ్వు, మొక్కలు కుళ్లిపోవడంతో పంట మొత్తం నష్టాల బారిన పడింది.

డిమాండ్ ఉన్నా ఫలితం సున్నా

పత్తి పంట చేతికందినా.. స్థానికంగా విక్రయించుకోలేని పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. దీంతో తొలి పూత దశ నుంచే జిల్లాలోని పత్తి రైతుకు ఎదురీత తప్పలేదు. ఇతర జిల్లాలో పత్తి పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ ఈ జిల్లాలో మాత్రం పత్తి పంటను పట్టించుకునే నాధుడు లేకపోవడంతో విక్రయాలు నెమ్మదిగా సాగాయి. ఇంతలోనే వర్షాలు పడడంతో పత్తి పంట పాడైంది. గత ఖరీఫ్‌లో జిల్లాలో 1833 హెక్టార్లలో పత్తి సాగు చేయగా ఈ ఏడాది 2683 హెక్టార్లు లక్ష్యం చేసుకోగా కేవలం 1777 హెక్టార్లులో మాత్రమే పత్తి పంట సాగైంది. 3400 మంది రైతులు ఈ పంటను ఈ ఏడాది సాగు చేసారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 20204-25 సీజన్‌కుగాను పత్తి పంట క్వింటాకు రూ.7521లు మద్దతు ధర ప్రకటించారు. ఈ మద్దతు ధర ప్రకారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించాలంటే రైతులు ముందుగా ఈ క్రాప్ బుకింగ్ చేసి ఉండాలి. ఈ ప్రక్రియలో అలసత్వంతో పాటు పత్తి కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక రైతులు తుఫాన్ వర్షాలు నుంచి పత్తి పంటను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడింది.

జేసీబీ దొంగ అరెస్టు

- జేసీబీ దొంగ అరెస్టు



దొంగలించిన జేసీబీ వద్ద నిందితుడిని అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ కె నారాయణరావు

రామభద్రపురం: స్థానిక టీబీఆర్ థియేటర్ వద్ద పార్కు చేసిన జేసీబీ ఈ నెల 20న చోరీకి గురైంది. జేసీబీ యజమాని శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. ఈ క్రమంలో తెర్లాం మండలం డి.గదబవలస వద్ద జేసీబీని దొంగలించిన నిందితుడు గురువారం పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. తారాపురం గ్రామానికి చెందిన శివకుమార్ తన జేసీబీని స్థానిక టీబీఆర్ ఆవరణలో పార్కు చేసాడు. అయితే ఆ జేసీబీని ఎప్పటి నుంచో పరిశీలిస్తున్న శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం శివరాంపురానికి చెందిన బద్రి హరికృష్ణ చోరీ చేసేందుకు ప్రణాళిక వేసి ఈ నెల 20న సినిమా సెకండ్ షో విడిచిపెట్టిన తరువాత జేసీబీని చోరీ చేశాడు. ఒక తాళం చెవితో జేసీబీ తాళం తీయడం విశేషం. తరువాత జేసీబీని బాడంగి మీదుగా తెర్లాం సమీపంలోని భారతి పెట్రోల్ బంకు వద్దకు తీసుకువెళ్లి రూ.1500 పెట్రోల్ వేయించి డి.గదబవలస వద్ద ఓ మామిడి తోటలో పార్కు చేసి వెళ్లిపోయాడు. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి బాడంగి మీదుగా వెళ్లడాన్ని గుర్తించి జేసీబీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హరికృష్ణ తోటలో పార్కు చేసిన జేసీబీని వెదుకుతున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి సీఐ నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో నిందితుడికి ఒక జేసీబీ ఉండేదని, దాని ఫైనాన్స్ చెల్లించలేక ఫైనాన్స్ కంపెనీ వారు పట్టుకెళ్లిపోయారని పోలీసులు తెలిపారు. తరువాత జేసీబీ దొంగలించి పార్టులు లెక్కన తీసేసి ఆ భాగాలను విక్రయించడం అలవాటుగా చేసుకున్నాడని తెలిపారు. నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

ఏటీఎం వద్ద రైతుకు టోకరా



పోలీస్‌స్టేషన్‌లో సీఐ నారాయణరావుకు ఫిర్యాదు చేస్తున్న రైతు శంకరరావు

రామభద్రపురం: ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాలో పడిన ఆనందం ఆ రైతు కళ్లల్లో క్షణం కూడా నిలువలేదు. స్థానిక స్టేట్ బ్యాంకు ఏటీఎం వద్ద రైతును ఓ మోసగాడు తప్పుదోవ పట్టించి ఏటీఎం కార్డు మార్చేసి ఉడాయిండంతో ఆ రైతు లబోదిబోమంటూ పోలీసులు ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన గొర్లి శంకరరావు ఇటీవల ధాన్యం విక్రయించగా ఆ డబ్బులు తన వ్యక్తిగత ఖాతాలో జమయ్యాయి. ఆ డబ్బులు తీసుకునేందుకు స్థానిక స్టేట్‌బ్యాంకు ఏటీఎం వద్దకు గురువారం వచ్చాడు. ఏటీఎం కార్డు మెషీన్‌లో పెట్టి డబ్బులు తీయగా డబ్బులు రాలేదు. దాంతో అక్కడ కాపుకాసి ఉన్న ఓ వ్యక్తిని మోసగాడని గుర్తించలేక అతడి చేతికి ఏటీఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయాలని కోరాడు. రైతు ఏటీఎం అందుకున్న మోసగాడు ఏటీఎంలో కార్డు పెట్టి డబ్బులు తీసినట్లు కొద్దిసేపు నటించి డబ్బులు రాలేదని నమ్మబలికాడు. అనంతరం కార్డును మార్చేసి తన వద్ద ఉన్న వేరొక ఏటీఎం కార్డు రైతుకు ఇచ్చి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన రైతు బ్యాంకు అధికారులను సంప్రదించగా ఆ మోసగాడు సాలూరు స్టేట్ బ్యాంకు వద్ద రూ.40 వేలు తీసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించి మిగతా డబ్బులు తీయకుండా బ్యాంకు ఖాతా లాక్ చేశారు. దీంతో రైతు శంకరరావు లబోదిబోమంటూ పోలీస్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నారాయణరావు మాట్లాడుతూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, ఆ మేరకు సీసీ పుటేజ్‌లను పరిశీలించి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

31న డీఎస్‌పీసీఏ సమావేశం

పార్వతీపురం టౌన్: జంతువులపై క్రూరత్వ నియంత్రణ కమిటీ సమావేశం ఈ నెల 31న నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం 31న కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని, సంబంధిత అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు. గోశాల మంజూరు, నిర్మాణం, అక్రమ పశురవాణా, కోడి పందాల నివారణ, విద్యా సంస్థల్లో యానిమల్ కైండ్‌నెస్ క్లబ్స్ ఏర్పాటు, సామాజిక బాధ్యతతో జంతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

దివ్యాంగులకు రాయితీపై పెట్రోల్

పార్వతీపురంటౌన్: మూడుచక్రాల మోటర్‌రైజ్డ్ వాహనం కలిగిన దివ్యాంగులకు రాయితీపై పెట్రోల్ సరఫరాకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్ణీత దరఖాస్తుఫారం పూర్తి చేసి దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు ఫోన్-08942-240519 నంబర్‌కు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు.

ఆ పాదముద్రలు పులివికావు.. పిల్లివి

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామంలో గురువారం కరిబుగత సత్యనారాయణ పొలంలో పులి అడుగులు ఉన్నట్టు కొందరు రైతులు అనుమానించారు. విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. అవి పులి అడుగులు కావు ఫిషింగ్ క్యాట్ అడుగులుగా నిర్ధారించారు. ఇటీవల కాలంలో శివరాంపురం గ్రామ సమీపంలో వేగావతి నదిలో వేపుగా పెరిగిన గడ్డిలో కొన్ని దుప్పులు తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వాటిని కాపాడాలని కోరుతున్నారు.

జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని తోటపాలెంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా అవనాపు భార్గవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవనాపు విజయ్, ఛైర్మన్‌గా ఐవిపి.రాజు, కార్యదర్శిగా ఎం.లక్ష్మణరావు నియామకమయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.సంతోష్, కాళ్ల మహేష్, సంయుక్త కార్యదర్శిగా లావేటి మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్దిల అప్పలనాయుడు, కోశాధికారిగా జె.హేమశంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా గౌరి, మీసాల.గీత, మద్దిల నారాయణ, బోని రమేష్‌లకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడింట్ అవనాపు విజయ్ మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఎటువంటి గుర్తింపు లేని అసోసియేషన్ గత కొన్నేళ్లుగా నడుస్తుందని, తద్వారా క్రీడాకారులకు జాతీయ పోటీలకు వెళ్లే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఈ నేపథ్యంలో నూతన అసోసియేషన్ ఏర్పాటు చేయటం ద్వారా క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించటం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. నిరుపేద క్రీడాకారులకు అన్ని విధాలుగా ఆదుకునేలా అసోసియేషన్ తరపున చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ బాక్సర్‌లు పాల్గొన్నారు.

స్కూల్‌కు వెళ్తూ.. తిరిగి రాని లోకాలకు...

- ఆటో నుంచి జారిపడి ఐదో తరగతి విద్యార్థి దుర్మరణం
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



భార్గవసాయి(ఫైల్)



పోస్టుమార్టం గది వద్ద రోదిస్తున్న తండ్రి ఈశ్వరరావు



సీహెచ్‌సీ వద్ద ఆటోలో విలపిస్తున్న తల్లి గౌరి

చీపురుపల్లి: తొమ్మిదేళ్ల బాలుడు ఆటో ప్రమాదంలో అందనంత లోకాలకు వెళ్లిపోయాడు. పాఠశాలకని రోజూ వెళ్లే ఆటోలోనే ఎప్పటిలాగే గురువారం ఆ బాలుడు తన చెల్లితో బయలుదేరాడు. తండ్రే తమ బిడ్డలను ఆటో ఎక్కించాడు. టాటా.. బైబై.. అంటూ.. చెప్పాడు. ఇంతలోనే మగబిడ్డ ప్రమాదవశాత్తు ఆ ఆటో నుంచి జారి పడిపోయాడు. ఆటో టైరు బాలుడి మీదుగా వెళ్లిపోవడంతో మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన గూనాన భార్గవసాయి(9) చీపురుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఆటోలో తన చెల్లి సుష్మప్రియ(4)తో కలిసి బయలుదేరాడు. వీరిని తండ్రి ఈశ్వరరావు దగ్గరుండి ఆటో ఎక్కించాడు. మెట్టపల్లి నుంచి బయలుదేరిన పదిహేను నిమిషాల్లోనే అలజంగి సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆటోలో ఉన్న భార్గవసాయి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ విషయం ఆటో డ్రైవర్ గమనించే లోపే భార్గవసాయి తల భాగం పైనుంచి ఆటో వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల నుంచి స్పందన కరువు

మండలంలోని అలజంగి సమీపంలో గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆటో నుంచి జారి పడిన ఘటనలో భార్గవసాయి మృతి చెందాడు. అక్కడి నుంచి స్థానికులే వేరే ఆటోలో మృతదేహాన్ని చీపురుపల్లి సీహెచ్‌సీకు తీసుకొచ్చారు. అప్పటికే భార్గవసాయి మృతి చెందాడు. ప్రమాదం జరిగి, మృతదేహం సీహెచ్‌సీకి చేరుకున్నప్పటికీ పోలీసులు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై విమర్శలొచ్చాయి. ఉదయం 9.30 గంటల వరకు పోలీసులు రాకపోవడంతో గ్రామ సర్పంచ్ శ్రీను నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

నిండు నూరేళ్ల జీవిస్తాడనుకున్న కన్న కొడుకు తొమ్మిదేళ్లకే మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు ఈశ్వరరావు, గౌరీలు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కగానొక్క కొడుకు స్కూల్‌కు వెళ్తా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో దుఃఖం దిగమింగలేకపోతున్నారు. తమ చేతులతో కొద్ది నిమిషాల ముందు ఆటో ఎక్కించిన తమ బిడ్డ అంతలోనే మృతి చెందడంతో దేవుడా... ఇంతగా శిక్షించావా? అంటూ సీహెచ్‌సీ వద్ద కన్న బిడ్డ మృతదేహాన్ని చూసి రోదించారు. మా బిడ్డను తీసుకుపోయి మాకు కడుపు కోత మిగిల్చావా..! దేవుడా.. అంటూ అరణ్య రోదనలు చేశారు. వీరి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

అండగా వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇదిలా ఉండగా ప్రమాద విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ ఛైర్మన్ గవిడి సురేష్ సీహెచ్‌సీకు చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. వైద్యులతో మాట్లాడి వైద్య పరీక్షలు జరిపించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించడంతో తక్షణమే పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. దీంతో భార్గవసాయి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

జనవరి 26న 50 వేల మొక్కల పంపిణీ

- కొత్తగా కాలుష్య తనిఖీ వాహనాలు, చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు
- 1 నుంచి పట్టణంలో వాకింగ్ జోన్
- వాయు కాలుష్యం మరింత తగ్గించేందుకు కలెక్టర్ అంబేడ్కర్ చర్యలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వచ్చే నెల జనవరి 26న జిల్లా వ్యాప్తంగా 50 వేల మొక్కలు పంపిణీ చేసి నాటిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై ఆయన చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు పేర్కొన్నారు. పట్టణంలో వాయు కాలుష్య తీవ్రతను తొలిత తెలుసుకున్నారు. గతంలో తీసుకున్న చర్యల ఫలితాలపై సమీక్షించారు. కాలుష్యాన్ని తగ్గించడానికి, పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి మరిన్ని చర్యలకు కలెక్టర్ ఉపక్రమించారు. దీనిలో భాగంగా విజయనగరం పట్టణంలో జనవరి 1 నుంచి వాకింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రదేశాల్లో వాహనాలను ఎట్టిపరిస్థితిలోనూ అనుమతించకూడదని, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. తొలిత స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నుంచి గంటస్తంభం వరకు వాకింగ్ జోన్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. వాహనాల కాలుష్య తనిఖీలు ముమ్మరంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీని కోసం పట్టణంలోని డ్వాక్రా సంఘాల ద్వారా కొత్తగా ఐదు కాలుష్య తనిఖీ వాహనాలను సమకూర్చాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పట్టణంలో రెండు సోలార్ చార్జింగ్ స్టేషన్లను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. పచ్చదనాన్ని పెంచేందుకు ఒకేసారి సుమారు 50 వేల మొక్కలను పంపిణీ చేసి ప్రతి ఇంటి ఖాళీ స్థలంలో నాటేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ మూడు కార్యక్రమాలను జనవరి 26న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పట్టణంలో దుమ్ము, ధూళి రేగకుండా ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను సైతం తారు లేదా సిమ్మెంటు రహదారులుగా మార్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కల్తీ నిరోధించేందుకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అన్ని పెట్రోలు బంకులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ సరిత, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ప్రాంతీయ రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మణిశంకర్, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ హరిప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు, ఉద్యానశాఖ డీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ, డీఎస్‌ఓ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యర్థ నిర్వహణ పాటించకపోతే ఆస్పత్రుల సీజ్

ఆస్పత్రుల వ్యర్థ పదార్థాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలక ప్రక్రియ అని ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని జాగ్రత్తగా నిర్ణీత సమయంలోగా తరలించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా పర్యవేణ కమిటీ సమీక్షా సమావేశం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణకు జిల్లాలో తీసుకున్న చర్యలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ బీబీ సరిత వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత వ్యవధి 48గంటల్లోగా ఆస్పత్రిలోని చెత్తను తరలించాల్సి ఉంటుందని, అన్ని ఆస్పత్రులను జనవరి 5వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసి చెత్త తరలింపును ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖల అధికారులు, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.